# సాహసానికో పిల్లాడు

విజయలక్ష్మి మురళీధర్

ఆ అమ్మాయి చక్కటి చుక్క, చదువుకుంది. చలాకిగా వుంటుంది.

అబ్బాయి చాకు లాటివాడు. ఉద్యోగం వున్నవాడు. అంతో ఇంతో ఆస్తి వున్నవాడు.

ఇద్దరూ పట్టణాలలో చదువుకున్నారు. సిటీల సంస్కారాలు బాగా అబ్బిన వారు.

ఆ పడుచు వారికి పెళ్ళి చూపులన్నారు.

ఇద్దర్నీ ఓ చోట కలిపారు. చూసుకోమన్నారు. మాట్లాడుకోమన్నారు.

సంభాషణ లైకింగ్‌కి, లైకింగ్ నించి లవింగ్‌కి కూడా మారింది.

అబ్బాయి అమ్మాయికి, అమ్మాయి అబ్బాయికి నచ్చారు.

అంత కంటే ఏం కావాలి!

అంత వరకు బానే వుంది.

ఇక మొదలయినది బేరాలాటా ఆడపిల్ల తల్లి తండ్రుల గుండెల్లో గుబ గుబ.

పెద్దలు పిల్లల్ని కుర్చీల్లోంచి లెమ్మని తాము కూర్చున్నారు.

మధ్యవర్తి మెల్లిగా కట్నాల సంగతి ఎత్తాడు. పిల్లాడి తండ్రి లక్ష అన్నాడు. అమ్మయ్యో, ఏభయ్యే ఇవ్వగలను అన్నాడు పిల్ల తండ్రి

మా ప్రిస్టేజి సంగతేమిటి! మా స్థితి గురించి కూడా ఆలోచించండి. ఆలోచనలో పడ్డాడు పిల్లాడి తండ్రి.

పోనీ డెబ్బయి అయిదు అన్నాడు.

దీనంగా చూశాడుపిల్ల తండ్రి మధ్యవర్తివైపు.

మధ్యవర్తి పిల్లాడి తండ్రి చెవిలో గుసగుసలాడాడు పిల్ల తండ్రి చెవిలో గుసగుసలాడాడు.

ఆఖరికి తీర్మానం కుదిరింది.

పిల్లవాడి తండ్రి చాలా చాలా మంచివాడు కాబట్టి ఏభయి వేలే కట్నం తీసుకుంటాడు. కాని లాంఛనాల రూపంలో, వెండి వస్తువుల మూట ఇంత బరువు, బంగారు మూట ఇంత బరువు — ఇంకా మంచాలు సోఫాలువగైరా వగైరా వగైరా....లిస్ట్ చెప్పబడింది.

ఎలాగూ పిల్లకి పెట్టదలుచుకున్నాడు. ఇంకాస్త ఎక్కువయినా ఫర్వాలేదనుకుని ఒప్పేసుకున్నాడు పిల్ల తండ్రి.(తను ఇక చేయవలసిన అప్పుల గురించి ఆలోచిస్తూనే)

ఇవేవి తెలియని అమ్మాయి అబ్బాయి అప్పుడే నిద్రలు మానేసుకుని ఒకరికోసం ఇంకొకరు తపించి పోసాగారు. తమ పెళ్ళి గురించి కలలు కనేయసాగారు.

అబ్బాయి తాళి కట్టాడు. అక్కడ జరిగినది ఓ రెండు మనసుల కలయిక — స్వచ్ఛమయిన ప్రేమ సంగమం.

కానీ ఆ కలయికకి ఎంతటి మసిని పూశారు పెద్దలు. ఆ ఇద్దరు కలవడానికి ఎంత వ్యాపారం జరిగింది.

దీనికి అంతు లేదా!

వరకట్న నిర్మూలన అంటున్నారు?

ఎక్కడ?

పేపర్లలో స్పీచుల్లో.

తన మాంగల్యాన్ని కొన్ని వేల రూపాయలతో కొనుక్కున్నానన్న నిజాన్ని ఏ ఆడపిల్లయినా ఎలా జీర్ణించుకోగలదు.

బేరాలు పెట్టి లాంఛనాల రూపంలో వీలయినంత తండ్రిని దోచిన అత్త మామల్ని ఎలా గౌరవించగలదు!

ప్రేమించడమే తన వంతు— కట్నాల విషయం తల్లితండ్రుల వంతు అంటూ దులిపేసుకునే భర్త మీద ఏనాటికయినా అనుమానం, డబ్బిస్తేగానీ నన్ను చేసుకోలేదు అన్న ఫీలింగ్ తలెత్తి సంసారం నరకం అవదా?

ఎందుకలా కలుషిత మయిపోతోంది. ఆలుమగల మధ్యనుండవలసిన ప్రేమ, అనురాగం!

కారకులెవరు!

నవ్వు వచ్చే విషయం ఏమిటంటే! ఈ కట్నాలని సమర్ధించే వారుగూడా ఎక్కువయి పోతున్నారు.

ఆ మధ్య ఒక జాతీయ ఆంగ్లదిన పత్రిక కట్నాల మీద ధారావాహికంగా ఉత్తరాలని ప్రచురించింది. దాన్ని విమర్శిస్తూ చాలామంది వ్రాశారు.


ఒక ఆంగ్లో ఇండియన్ వనిత ఏంరాసిందంటే కట్నం తీసుకుంటే తప్పేమిటి!

నేను కొడుకుని కష్టపడి కని చమటోడ్చి చదివించి పెంచాను. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి తిండి పెట్టాను కొడుక్కి. ఎంతో ఖర్చు పెట్టి చదివించాను కొడుకుని. కానీ పెళ్ళయి, సెటిలయి, తనంతట తను బతకగలిగినప్పుడు, నన్ను సరిగ్గా చూసుకుంటాడని గ్యారంటీ ఏమిటి!

నేను అన్నాళ్ళూ పెట్టిన ఖర్చుని కట్నరూపంలో లాగితే, నాకో సపోర్టుని కలిగించుకుంటే తప్పేమిటి! అని గొప్పగా రాసింది.

అవును నిజమే అని సమర్థించే పెద్దలని చూశాను

ఇవేవీ తెలియని అమ్మాయి అబ్బాయి అప్పుడే నిద్రలు మానేసుకుని ఒకరి కోసం ఇంకొకరు తపించి పోసాగారు. తమ పెళ్ళి గురించి కలలు కనేయసాగారు. అబ్బాయి తాళి కట్టాడు. అక్కడ జరిగినది ఓ రెండు మనసుల కలయిక




వాహా ఎంత బాగుంది?

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా కల్తీ అని వింటున్నాం.

ఆఖరికి మాతృప్రేమలోకూడా కల్తీ అన్నమాట.

తన పేగుల్ని తెంచుకొని బయట పడ్డ బిడ్డని చూసుకున్నప్పుడు ఉబికి వచ్చే ఉద్వేగానికి విలువెంత!

పాలిచ్చినప్పుడు దానికి వడ్డీతో సహా కొడుకు పెరిగాక లాగాలి అనుకుంటూ ఇస్తుంటే—

పెట్టే ప్రతి గోరుముద్దకీ, విలువ కట్టి ఎప్పుడో ఆ లెఖల్ని లాగాలని చూస్తుంటే కొన్న ప్రతి బట్టకీ లెఖలువేసుకుంటుంటే

నేర్పే ప్రతి కదలికకీ, చిలకపలుకులకీ ఎ.బి.సి.డీలకి విలువకట్టి — కొడుకు మంచి బ్రతుకు బ్రతకాలని కాకుండా ఆ డిగ్రీకి పెట్టిన ఖర్చుకి మూడింతలు తరువాత లాగొచ్చు అని ఊహించే తల్లులు ఉన్నారంటే?

అసలు కొడుకుల్ని కనడం ఎందుకు! కష్టపడి ఖర్చుపెట్టడం ఎందుకు — వడ్డీతో సహా ఆ ఖర్చుల్ని లాగుదాం అని ఎదురు చూస్తూ వుండటం ఎందుకు?

కల్మషంతో నిండిపోతున్న మాతృప్రేమని ఆ భగవంతుడే కాపాడాలి

వరకట్నాల గారడీకి అంతం చూపించాలి. *